జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 26 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 6

## తాగునీటి సమస్యపై అప్రమత్తం కావాలి: ఎమ్మెల్యే



**కొత్తగూడెం, ఏప్రిల్ 25 (ప్రజా జ్యోతి)** వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. శనివారం సింగరేణి అతిథిగృహంలో మిషన్ భగీరథ, కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పైపులైన్ల లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని అవసరమైన చోట కొత్త బోర్లు త్రవ్వాలని సూచించారు. కొనసాగుతున్న నీటి పథకాల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ అందేలా పర్యవేక్షణ పెంచాలని, ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించే వ్యవస్థ ఉండాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, అధికారులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికలో ఆరు నెలల పసి గుడ్డు

- మానవత్వాన్ని ముక్కలు చేసిన ఘటన
- గుట్ట మల్లారంలో వెలుగుచూసిన హృదయ విదారక సంఘటన
- కన్నీటి పర్యంతమైన స్థానికులు



**మణుగూరు, ఏప్రిల్ 25 (ప్రజాజ్యోతి ):** "అమ్మ" అనే పదం ప్రేమకు, త్యాగానికి, అపారమైన మమకారానికి ప్రతీకగా నిలుస్తుంది. భగవంతుడు ప్రతి చోట ఉండలేక తల్లిని సృష్టించాడని పెద్దలు చెబుతారు. అలాంటి తల్లి ప్రేమను మించినది ఈ ప్రపంచంలో లేదని భావించే సమయంలో కొందరు చేస్తున్న అమానవీయ చర్యలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. నవమాసాలు మోసి జన్మనివ్వాల్సిన పసిబిడ్డలను నిర్దాక్షిణ్యంగా వదిలివేస్తున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకున్న తాజా ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసింది. శనివారం ఉదయం గుట్ట మల్లారం వైకుంఠ ధామం స్మశాన వాటికలోని బాత్రూంలో ఆరు నెలల ఆడ పసి గుడ్డును

మిగతా 2 లో...



# తాగునీటి సరఫరా పై హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి

- నాలుగు రోజుల్లో పెండింగ్ తాగునీటి సమస్యలను పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ఏప్రిల్ 25 (ప్రజాజ్యోతి)** వేసవికాలంలో తాగునీటి కొరత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హెల్ప్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం నుండి నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా భద్రాచలం పి.ఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలెక్టర్ వేసవిలో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో తాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదేనని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు పరస్పర సమన్వయంతో పని చేసి ప్రతి గ్రామానికి నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,

మిగతా 2 లో...

## వడ్ల కొనుగోలు సమస్యపై అన్నపురెడ్డిపల్లి మండలంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ పర్యటన

- రైతులతో ముఖాముఖి.. త్వరితగతిన కొనుగోళ్లు చేపడతామని హామీ



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 25, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని గుంపెన సొసైటీలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనతో పాటు జాతీయ రహదారిపై రైతులు చేపట్టిన ధర్నా నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ శనివారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు పది లారీల వడ్లు కూడా కొనుగోలు చేయలేదని, ఎగుమతి చేసిన నాలుగు లారీల ధాన్యం సైతం ఇప్పటివరకు దిగుమతి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన

మిగతా 2 లో...

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల నాకాబందీ

- అసాంఘిక కార్యకలాపాల అరికట్టే దిశగా ప్రత్యేక తనిఖీలు
- వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, ఫింగర్ ప్రింట్ వెరిఫికేషన్ నిర్వహించిన పోలీసులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25, ప్రజా జ్యోతి:** జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. శనివారం రాత్రి 7.30 గంటల నుంచి 10 గంటల వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఐదు సబ్ డివిజన్ల

మిగతా 2 లో...

## వడ్ల కొనుగోలు సమస్యపై అన్నపురెడ్డి పల్లి మండలంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ పర్యటన



(మొదటి పేజీ తరువాయి...)
జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ధాన్యం శుభ్రపరిచే యంత్రాల జల్లెడలు సరిగా లేకపోవడం, వడ్ల నాణ్యతలో లోపాలు ఉండడం వల్ల దిగుమతులు ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. రైతులకు తగిన సమయంలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు తాము పండించిన వరి పంటను పూర్తిగా కొనుగోలు చేసి ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై విజయసింహారెడ్డి, ధాన్యం రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హిందూ ఐక్యత గర్జనకు సిద్ధమైన కొత్తగూడెం

- హిందూ సమ్మేళనం కోసం విస్తృత ఏర్పాట్లు
- హిందూ శక్తి ప్రదర్శనకు అందరూ తరలి రండి అంటూ ప్రచారాలు జోరుగా






**కొత్తగూడెం, ఏప్రిల్ 25 ( ప్రజాజ్యోతి )** కొత్తగూడెం పట్టణం హిందూ ఐక్యత గర్జనకు వేదికగా మారేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 26 వ తేదీ ఆదివారం రోజు నిర్వహించనున్న హిందూ సమ్మేళనం నేపథ్యంలో పట్టణమంతా జాతర వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా ప్రచార హోరు, జెండాలు, బ్యానర్లతో కార్యక్రమానికి భారీ స్పందన కనిపిస్తోంది. అదే సమయంలో ఆటోల్లో మైక్‌ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తూ సభకు హాజరు కావాలని ప్రజలను ఆహ్వానిస్తున్నారు. హిందూ సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇప్పటికే తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిస్తున్నారు. ఇప్పటికే వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున హాజరయ్యేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మహాసమ్మేళనం ద్వారా సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, ధార్మిక చైతన్యం పెంపొందించాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇది ఒక వేదికగా నిలవనుందని భావిస్తున్నారు. ఇంత పెద్ద స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు తీసుకుంటున్న కృషి ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలు విశేషంగా నిలుస్తున్నాయి. కొత్తగూడెంలో నెలకొన్న జాతర వాతావరణం, కార్యక్రమానికి లభిస్తున్న భారీ స్పందన చూస్తే ఈ సమ్మేళనం విజయవంతం కావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# తాగునీటి సరఫరా పై హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)
నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి మండలం, గ్రామంలో బోర్ వెల్లు, చేతి పంపులు వంటి ప్రత్యామ్నాయ వనరులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు. మోటార్లలో లోపాలు తలెత్తినపుడు తక్షణమే మరమ్మతులు చేయడానికి అదనపు మోటార్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, ఎంఆర్‌ఓ కార్యాలయాల్లో హెల్ప్ లైన్ నంబర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో చివరి దూర ప్రాంతాలకు



కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే గరిష్టంగా 24 గంటల్లోపు పరిష్కరించాలన్నారు, మున్సిపల్ కమిషనర్లు ప్రతి వార్డులో ఉదయం నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా తాగునీటి సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గుత్తి కొయ హ్యాబిటేషన్లలో సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాల్వంచలో 55, చర్లలో 54, దుమ్ముగూడెంలో 55 త్రాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణలో వాటిని ఎందుకు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారా? ఇంకా పనులు పెండింగ్ లో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేస్తూ, నాలుగు రోజుల్లోపే అన్ని త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా ఆదేశించారు. రానున్న మూడు నెలలు అత్యంత కీలకమని , ఎక్కడా నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తాగునీటి సమస్యలపై సమగ్ర నివేదికలు సమర్పించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# స్మశాన వాటికలో ఆరు నెలల పసి గుడ్డు...

(మొదటి పేజీ తరువాయి...)
గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లడం స్థానికులను షాక్ కు గురిచేసింది. ఉదయం స్మశాన వాటిక వైపు వెళ్లిన కొందరు గ్రామస్తులు బాత్రూం వద్ద రక్తపు మరకలు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేశారు. లోపలికి వెళ్లి చూడగా రక్తపు ముద్దలా పడి ఉన్న ఆడ శిశువు పిండాన్ని చూసి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. కొంత మంది మహిళలు అక్కడికక్కడే కన్నీళ్లు పెట్టుకోగా, మరికొందరు “ఇంత చిన్న ప్రాణం ఏ పాపం చేసింది” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న బాలల సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. శిశువు పిండాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు.



స్థానికులు, సామాజిక వర్గాలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాల ప్రకారం...
ఇలాంటి ఘటనల వెనుక ప్రేమ పేరుతో మోసపోయిన యువతులు, సామాజిక భయం, కుటుంబ పరువు భయం, ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లోపం వంటి అనేక కారణాలు ఉండవచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవాంఛిత గర్భధారణపై సరైన కౌన్సెలింగ్ లేకపోవడం కూడా ఇటువంటి ఘటనలకు దారితీస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గర్భంలో ఆడ శిశువు ఉందని తెలిసిన తర్వాత కొందరు దారుణ నిర్ణయాలకు పాల్పడుతున్న ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. ప్రభుత్వాలు “బేటీ బచావో – బేటీ పడావో” వంటి పథకాల ద్వారా అవగాహన కల్పిస్తున్నప్పటికీ, ఇంకా కొందరిలో ఆడపిల్లల పట్ల వివక్ష పూర్తిగా తగ్గలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
బాలల పరిరక్షణ అధికారులు మాట్లాడుతూ ఎవరైనా శిశువులను పెంచుకోలేని పరిస్థితుల్లో ఉంటే ప్రభుత్వ బాలల సంరక్షణ కేంద్రాలు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా సంబంధిత శాఖలను సంప్రదించాలని సూచించారు. శిశువులను చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ ద్వారా పిల్లలు లేని కుటుంబాలకు అప్పగించే అవకాశం ఉందని తెలిపారు. కానీ ఇలా నిర్జన ప్రదేశాల్లో లేదా స్మశాన వాటికల్లో వదిలేయడం చట్ట విరుద్ధమే కాకుండా అమానవీయమని పేర్కొన్నారు. సింగారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మణుగూరు సీఐ నాగబాబు తెలిపారు. సంఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని, సమీప ప్రాంతాల సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమవగా మానవత్వం ఎటువైపు వెళ్తుందోనన్న ఆందోళన ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతోంది.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల నాకాబందీ

(మొదటి పేజీ తరువాయి...)
డీఎస్పీల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో పోలీసులు పాల్గొని వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనాల పత్రాలను పరిశీలించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. అదేవిధంగా పాత నేరస్తులను గుర్తించేందుకు ఫింగర్ ప్రింట్ డివైస్ ల సహాయంతో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల వివరాలను సేకరించి వారి వేలిముద్రలను పరిశీలించినట్లు వెల్లడించారు. నాకాబందీ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు.





# డిప్యూటీ సీఎం, మంత్రిని కలిసిన ఎమ్మెల్యే





**ఇల్లందు, ఏప్రిల్ 25, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రా ష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క లను శనివారం హైదరాబాదులో వారి వారి స్వగృహాల్లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను వారు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్క రిస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రా ష్ట్ర ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మలేరియా అవగాహనతోనే నివారణ

- మండల వైద్యాధికారి కంచర్ల వెంకటేష్






**టేకులపల్లి,ఏప్రిల్ 25, ప్రజాజ్యోతి:** మలేరియా ను అవగాహన తోనే నివారించవచ్చునని, ఇం దులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మండల వైద్య అధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తూకరం రాథోడ్, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ రామదాసు ఆదేశానుసారం శనివారం సులనగర్ ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి కంచర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిహెచ్సి సిబ్బంది తో మలేరియా నివారణకై ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా అనేది దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకర వ్యాధి అని, ముఖ్యంగా వర్షాకాలం నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే మలేరియాను పూర్తిగా నియంత్రించవచ్చని ఆయన పేర్కొన్నారు.మలేరియా వ్యాధి లక్షణాలలో జ్వరం,వణుకు,చెమటలు పట్టడం,తలనొప్పి,అలసట వంటి సమస్యలు కనిపిస్తాయని ఆయన తెలిపారు.ఈ లక్షణాలు ఉన్న వెంటనే స్థానిక వైద్య సిబ్బందిని లేదా సమీప ప్రభుత్వ ఆసుపత్రి ని సంప్రదించి మలేరియా నిర్ధారణ కొరకు ఉచితంగా చేసే రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల పెరుగుదలకు అవకాశం ఇవ్వకూడదని సూచించారు. రాత్రి సమయంలో దోమతెరలు ఉపయోగిం చడం,పూర్తి చేతుల బట్టలు ధరించడం,ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వం మలేరియా నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని, దోమలను నివారిద్దాం మలేరియాను తరిమికొడదాం అని ఆయన తెలిపారు. మలేరియాను అంతం చేసే దిశగా ఇప్పుడు మనం కృషి చేయాలి. అంటూ ప్రతి ఒక్కరూ మలేరియా వ్యాధిపై, దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ప్రజల సహకారం ఉంటే ప్రభుత్వం నిర్దేశించిన 2030 సంవత్సరం కల్లా మలేరియా రహిత సమాజం నిర్మాణం కచ్చితంగా సాధ్యమ వుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఇల్లందు సబ్ యూనిట్ అధికారి జాబిశెట్టి శ్రీనివాస్ రావు పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ ఆరోగ్య విస్తరణ అధికారి దేవా మలేరియా నోడల్ ఆఫీసర్ నాగుబండి వెంకటేశ్వర్లు సూపర్వైజర్లు గుజ్జ విజయ కౌసల్య సింగ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు చందన శైలజ హారిక రుక్సానా ధరణి ఇంద్రజ నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్,సింగరేణి నర్సింగ్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నాపురంలో వైద్య శిబిరం



**చర్ల, ఏప్రిల్ 25:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం సత్యనారాయణ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుర్నపల్లి ఏ ఏ ఏం సెంటర్‌కు చెందిన చెన్నాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.అదేవిధంగా గ్రామంలో అసింప్టమాటిక్ మలేరియా సర్వే కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏం ఎల్ హెచ్ పీ సంధ్య, ఏ యెన్ ఏం రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్, ఆశా వర్కర్ దేవి పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

- డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, నియోజక వర్గ మాజీ ఇంచార్జ్ మానె రామకృష్ణ.



**చర్ల, ఏప్రిల్ 25:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం పెద్దమిడిసిలేరు , చర్ల పట్టణంలో డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మాజీ నియోజకవర్గ ఇంచార్జ్ మానె రామకృష్ణలు మండల బి ఆర్ ఎస్ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే ఒకటి న దుమ్ముగూడెం మండల కేంద్రం లక్ష్మీనగరంలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది అని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏం పీ వద్దిరాజు రవిచంద్ర , మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ , జిల్లా అధ్యక్షులు మాజీ ప్రభుత్వ విప్ రేగ కాంతారావు పాల్గొంటున్నారు కావున చర్ల మండలం నుండి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలి అని తెలియచేశారు. చర్ల మండల బిఆర్ యస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని రానున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో కష్టపడి పని చేసి విజయం సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నాతని రాము, సయ్యద్ అజీజ్ ,ఎడ్ల రామదాసు, నియోజకవర్గ యువజన నాయకులు కాకి అనిల్, బి సి సెల్ అధ్యక్షులు గోరింట్ల వెంకటేశ్వర్ రావు, యువజన నాయకులు తడికల బుల్లెబ్బాయి , గడంశెట్టి కిషోర్ ,పసికంటి సంతోష్ ,వంకాయల వినోద్, ఎన్నమూరి సృజన్ ,కుక్కడపు సాయి సాంబశివరావు, శ్యామల రామారావు, యస్ టి సెల్ సెక్రటరీ కారం కన్నారావ్ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో మైనారిటీ గురుకుల విద్యార్థుల హవా

- హర్షం వ్యక్తం చేసిన మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 25, (ప్రజా జ్యోతి)** జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో మైనారిటీ గురుకుల సొసైటీకి చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించడంపై మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనారిటీ సీఓఈ, నాన్–సీఓఈ కాలేజీలకు చెందిన 105 మంది విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరుకాగా, అందులో 35 మంది అర్హత సాధించారని తెలిపారు. వీరిలో 7 మంది 90 శాతం పైగా, 16 మంది 80 పర్సంటైల్‌కు పైగా స్కోర్ సాధించినట్లు తెలిపారు ,మొత్తం ఫలితాల్లో జనరల్ కేటగిరీలో 93.42%, ఈడబ్ల్యూఎస్‌లో 82.42%, ఓబీసీలో 80.92%, ఎస్సీలో 63.9%, ఎస్టీలో 52.01% ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు. ఇతర గురుకులాల కంటే మైనారిటీ గురుకుల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం జరిగిందని, కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్న మైనారిటీ గరుకులాలను మైనారిటీలతో పాటు నాన్ – మైనారిటీ విద్యార్దులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆరాధన మహోత్సవమునకు విరాళం అందజేసిన సర్పంచ్



**టేకులపల్లి,ఏప్రిల్ 25, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా టేకులపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బోడా బాలు నాయక్ తన వంతు సహాయంగా రూ.25 వేలురూపాయలు ఆలయ కమిటీకి అందజేశారు.సర్పంచ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు గుడి బాగోగులకు చూసుకుంటా అని తెలిపారు.ఈ సందర్భంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేం ద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు.

## బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించాలి

- తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు




**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 25 , ప్రజా జ్యోతి ,** భారత ఎన్నికల సంఘం నిర్వహించ తలపెట్టిన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించి పకడ్బందీగా ఓటర్ల సర్వే ప్రక్రియను నిర్వహించాలని తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు బీఎల్ వోలను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం పట్టణంలో విధులు నిర్వహించనున్న బిఎల్ ఓ లతో తాసిల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లు 2002వ సంవత్సరంలో ఏ ప్రాంతంలో జీవించి ఉన్నారో ఎక్కడ ఓటు వేశారు సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు రద్దు కాకుండా చూడాలని స్పష్టం చేశారు. భద్రాచలంలో ఓటు కలిగి ఉండటంతో పాటు మరే ఇతర ప్రాంతంలో కూడా ఓటు కలిగి ఉన్నారో లేదో సమగ్రంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. ఎప్పటి పనిని అప్పుడు సంబంధిత అధికారులకు తెలియపరచాలని విధులలో నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. ఈ సమాజంలో బూత్ స్థాయి అధికారులు మరికొన్న సందేహాలను తాసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కీర్తి బిఎల్ ఓ లు పాల్గొన్నారు.

# రామాలయంలో జీర్ణోద్ధరణకు అంకురార్పణ

- విష్ణుసహస్రనామ పారాయణం, రుత్విక్‌వరణం నిర్వహణ



**భద్రాచలం కల్చరల్, ఏప్రిల్ 25, ప్రజా జ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో శనివారం నేడు జరిగే జీర్ణోద్ధరణకు అంకురార్పణ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోదావరి నుంచి తీర్ధబిందెను తెచ్చి ఆ జలాలతో తొలుత ప్రోక్షణ నిర్వహించారు. అనంతరం వైదిక బృందం ఆద్వర్యంలో విష్ణుసహస్ర పారాయణం చేశారు. అనంతరం విశ్వక్సేనార్చన, జీర్ణోద్ధరణ కార్యక్రమంలో పాల్గొనే రుత్వికులకు రుత్విక్ వరణం, రక్షాబంధన గావించారు. నేడు చినజీయర్‌స్వామి , రామాలయ విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు పర్యవేక్షణలో రాష్ట్రంలోని వివిధ ఆలయాల నుంచి వచ్చిన పాంచరాత్రగమ పండితుల నుంచి జీర్ణోద్ధరణకు అనుజ్ఞ తీసుకోనున్నారు.

# పోట్లపల్లిలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- రెండో రోజు ప్రత్యేక పూజలు



**పినపాక,ఏప్రిల్ 25(ప్రజాజ్యోతి ):** పినపాక మండలం పోట్లపల్లి గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా రెండో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించగా, భక్తులు గ్రామమంతా రామనామం, కృష్ణనామం జపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. అగశాలలో ఏర్పాటు చేసిన సకల దేవత మండప పూజలు, పంచద్రవ్యాభిషేకాలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఇక లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమం నిర్వహించడంతో పాటు విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ కార్యక్రమాలు గ్రామ కమిటీ, గ్రామ ప్రజల సహకారంతో, రుత్వికులు దుర్గాప్రసాదాచార్యులు, పులివర్తి పెద్దచార్యులు, పాయం సోమయ్య ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి.

# నీతి అయోగ్ బృందానికి వినతి పత్రాలు అందజేసిన కాంగ్రెస్ నాయకులు



**గుండాల. మార్చి. 25. ప్రజా జ్యోతి** మండల పర్యటనకు వచ్చిన నీటి అయోగ్ కేంద్ర బృందానికి వివిధ సమస్యలపై వినతి పత్రాలను కాంగ్రెస్ నాయకులు అందజేశారు శనివారం మండల పర్యటనకు వచ్చినఅడిషనల్ సెక్రటరీ సాయిబాబాకు డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ కు కాంగ్రెస్ నాయకులు పొంబోయిన ముత్తయ్య, వాంకుడోత్ బి కోజి నాయకత్వంలో వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు మండల కేంద్రంలో మార్చరి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని, వినతి పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో అబ్దుల్ నవి, కాసిం, గడ్డం రాజేష్, పుష్పరాజు, ఇస్రాల్, బొంగు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# మావోయిస్టు పార్టీ లేఖ విడుదల

- దేవ్జీ ద్రోహాన్ని ఎండగట్టండి -విప్లవ శ్రేణులకు మావోయిస్ట్ పార్టీ పిలుపు
- నయా-ప్రచండ మార్గాన్ని అనుసరిస్తున్నారంటూ ధ్వజం
- భూగర్భ విప్లవ పోరాటమే ఏకైక మార్గమని వెల్లడి

**చర్ల, ఏప్రిల్ 25:(ప్రజా జ్యోతి ):** కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ఉత్తర సమన్వయ కమిటీ (యెన్ సి సి ) పేరుతో విడుదలైన ఒక ప్రకటన సంచలనం రేపుతోంది. పార్టీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో మాజీ సభ్యుడు దేవ్జీ లొంగుబాటును తీవ్రంగా ఖండిస్తూ, ఆయనను 'విప్లవ ద్రోహి'గా పార్టీ అభివర్ణించింది. ఏప్రిల్ 17, 2026 నాటితో ఉన్న ఈ ప్రకటనలో దేవ్జీ అనుసరిస్తున్న 'నయా-ప్రచండ' మార్గాన్ని బట్టబయలు చేయాలని విప్లవ శ్రేణులకు పిలుపునిచ్చింది.

**లొంగుబాటు రాజకీయాలపై విమర్శలు:**
దేవ్జీ లొంగిపోయిన తర్వాత ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూను పార్టీ తప్పుబట్టింది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం (ఏం ఎల్ ఏం ) పై నమ్మకం ఉందని చెబుతూనే, పార్టీని చట్టబద్ధమైన సంస్థగా మార్చాలని చూడటం సవరణవాదమేనని మావోయిస్టు కమిటీ పేర్కొంది. "భూగర్భ ఉద్యమాన్ని వీడి, చట్టబద్ధత కోసం పాకులాడేవారు పార్టీకి బద్ధ శత్రువులు" అని లెనిన్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసింది. దేవ్జీని మరో 'సోను'గా పరిగణిస్తున్నామని, విప్లవకారుడి ముసుగులో ఉన్న శత్రు ఏజెంట్ అని విమర్శించింది.

**సాయుధ పోరాటమే ప్రధానం:**
పార్టీ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని ఉత్తర సమన్వయ కమిటీ స్పష్టం చేసింది.భారతదేశం వంటి దేశాలలో విప్లవం సాయుధ పోరాటం ద్వారానే సాధ్యమని పార్టీ పునరుద్ఘాటించింది. గెరిల్లా యుద్ధం, ప్రజల ప్రత్యామ్నాయ అధికార కేంద్రాల స్థాపనే తమ లక్ష్యమని వివరించింది.
సామ్రాజ్యవాదం, దళారీ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానం అనే మూడు మహా పర్వతాలను కూల్చివేయడమే తమ అంతిమ ధ్యేయమని పేర్కొంది.




**అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ:**
రాజు దా, కోస దా, హిద్మా వంటి నేతలు పార్టీ మార్గాన్ని కాపాడేందుకు ప్రాణత్యాగం చేశారని, కానీ దేవ్జీ వంటి వారు భయం వల్ల అవకాశవాదాన్ని ఎంచుకున్నారని విమర్శించింది. పార్టీలో ఎటువంటి వర్గాలు లేవని, కేవలం విచ్ఛిన్నకర శక్తులపైనే తమ పోరాటమని స్పష్టం చేసింది. 1970లలో చారు మజుందార్ మరణం తర్వాత ఎదురైన క్లిష్ట పరిస్థితుల నుంచే పార్టీ పునరుజ్జీవనం పొందిందని, ఇప్పుడు కూడా తాత్కాలిక బలహీనతలను అధిగమించి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

**శ్రేణులకు గందరగోళం వద్దు:**
ప్రభుత్వాలు, శత్రు శక్తులు దేవ్జీ వంటి వారిని వాడుకుని విప్లవ శ్రేణులను గందరగోళానికి గురి చేస్తున్నాయని, కేడర్ అంతా అప్రమత్తంగా ఉండి నూతన ప్రజాస్వామ్య విప్లవ జయప్రదం కోసం పనిచేయాలని కమిటీ పిలుపునిస్తూ ఉత్తర సమన్వయ కమిటీ (యెన్ సి సి ) సిపిఐ (మావోయిస్ట్) పేరున లేఖ విడుదల చేసారు.

# స్నేహం సేవలో నిలుస్తున్న ఎస్ ఆర్ హెచ్ ఎస్ పూర్వ విద్యార్థులు

- కాలం మారినా పరిస్థితులు మారినా స్నేహం మాత్రం మారదు
- 25 వసంతాల తర్వాత కూడా అజరామరం అయిన స్నేహితులు



**సుజాత నగర్ ప్రజా జ్యోతి ఏప్రిల్ 25 :** ఎస్ ఆర్ హెచ్ ఎస్ కొత్తగూడెం 10వ తరగతి పూర్తి చేసి 25 వసంతాలు పూర్తైన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఘనంగా గెట్ టు గెదర్ నిర్వహించారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు పాల్గొని పాత జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు స్నేహాన్ని కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, సేవా దిశగా ముందుకు తీసుకెళ్లే మహత్తర నిర్ణయం తీసుకున్నారు. ప్రతి నెల 10వ తేదీన ఒక్కొక్కరు రూ.100 చందా చెల్లించే విధంగా వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి, ఆ నిధిని అవసర సమయంలో స్నేహితులలో ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు తక్షణ సహాయం అందించేందుకు వినియోగిస్తున్నారు. అవసరంలో అండగా నిలబడటమే నిజమైన స్నేహం అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ వినూత్న ప్రయత్నం స్నేహానికి కొత్త నిర్వచనం ఇస్తూ, సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. 25 ఏళ్ల తర్వాత కూడా ఇదే ఉత్సాహంతో కలిసిన ఈ స్నేహితుల బంధం అందరికీ ప్రేరణగా మారింది.

# భద్రాచలం కోర్టు ఆవరణలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- జిల్లా జడ్జికి బార్ అసోసియేషన్ వినతి

**భద్రాచలం, ఏప్రిల్ 25, ప్రజా జ్యోతి:** భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ , అడిషనల్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , సెషన్స్ జడ్జి గౌరవనీయులు శ్రీమతి జి. ప్రేమలత గారికి భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి కోర్టు ఆవరణలో నెలకొన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుండి వచ్చే కక్షిదారుల సౌకర్యార్థం కోర్టు ప్రాంగణంలోనే నాణ్యమైన ఆహారం అందించే క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే అత్యవసర పత్రాల నకళ్ల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కోర్టు ఆవరణలోనే జిరాక్స్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు, కక్షిదారులు అవసరమైన ఇతర కార్యాలయ పనులు సులభంగా నిర్వహించుకునేందుకు తగిన వసతులు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ఉపాధ్యక్షులు సున్నం రమేష్, జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రటరీ టి. లలిత, లైబ్రరీ సెక్రటరీ పగడాల కవిత, లేడీ రిప్రజెంటేటివ్ ఎం. తరుణి, మాజీ అధ్యక్షులు కోట దేవదానం, సీనియర్ న్యాయవాదులు పోకల మోహన్ కృష్ణ, ఆశ్రిత తదితర సభ్యులు పాల్గొన్నారు. వినతి పత్రంపై స్పందించిన జిల్లా జడ్జి శ్రీమతి జి. ప్రేమలత గారు సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నీతి అయోగ్ బృందం పర్యటన పరిశీలన



**గుండాల. మార్చి 25. ప్రజా జ్యోతి** నీతి అయోగ్ గ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో శనివారం కేంద్ర బృందం పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గుండాలను ఆకాంక్షిత మండలంగా గుర్తించడంతో మండలంలోని వివిధ పనులు అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర అడిషనల్ సెక్రటరీ పవర్ అధికారి సాయిబాబా రాష్ట్ర నోడల్ అధికారి లోకేశు తో కూడిన బృందం మండలంలో పర్యటించారు గుండాల మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని , కస్తూర్బా గాంధీ పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు సమస్యలను తెలుసుకొని నీతి అయోగ్ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు మండలంలో నెట్వర్క్ సమస్య తీవ్రంగా ఉందని మండల అధికారులు కేంద్ర బృందానికి తెలియజేయగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు ప్రాథమిక ఉన్నత పాఠశాల స్థలాన్ని చదును చేయాలని మీటియోగ్ అడిషనల్ అధికారి సాయిబాబా జిల్లా సీఈఓ కు తెలిపారు ప్రభుత్వాల ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి , జిల్లా మహిళసంక్షేమ అధికారి లేనిన, డిఎం అండ్ హెచ్ ఓ సుదీప్ కుమార్, సత్యప్రసాద్ నవనీత్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# భూగర్భ జలాలు ఇంకిపోకుండా చర్యలు చేపట్టాలి

- చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో నీటికొరత తపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 25 ప్రజాజ్యోతి**

ఎండలు ముదిరినందున చాలాచోట్ల భూగర్భ జలాలు ఇంకిపోవడం వలన ఏజెన్సీ మండలాలైన చర్ల దుమ్ముగూడెం లోని మారుమూల ప్రాంత గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులకు మంచి నీటి సమస్య తలెత్తకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం నాడు భద్రాద్రి, కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలు నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎంపీడీవోలు, నీటి పారులశాఖ ఈఈలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్ లు, స్పెషల్ ఆఫీసర్లతో వివిధ మండలాల లోని మారుమూల గ్రామాలలోని హెప్టేషన్లలో మంచినీటి సమస్య తలెత్తకుండా తీసుకోవలసిన కార్యాచరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మండలాలలోని ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, ఎంపీఓలు, స్పెషలాఫీసర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ లు సమన్వయంతో ఉండి ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మంచినీటి సరఫరాకు సంబంధించిన మిషన్ భగీరథ పైప్ లైన్లు కానీ మోటార్స్ రిపేర్ లో ఉంటే 24 గంటల్లో మరమ్మత్తులు చేయించి 24 గంటల్లో మంచినీటి సరఫరా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించిన ప్రతి స్టేటస్ తనకు పంపించాలని అన్నారు. అలాగే మంచి నీటి సరఫరా చేసే ట్యాంకర్లు, అవసరమైన జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎంపీడీవోలు మంచి నీటికి సంబంధించిన ప్రతి సమాచారము కచ్చితంగా అందించాలని అన్నారు. ఏజెన్సీలోని మారుమూల మండలాలు చర్ల దుమ్ముగూడెం లలో పూసగుప్ప, బోధ వెల్లి, కూర్నవల్లి, లక్ష్మీపురం, సుబ్బంపేట గ్రామాలలో మంచి నీటి సమస్య రాకుండా చూడాలని, అవసరమైతే ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని అన్నారు. ప్రతి ఎంపీడీవో, ఎమ్మార్వో, మున్సిపల్ కార్యాలయంలలో హెల్ప్ లైన్లు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఎండాకాలంలో ఈ మూడు నెలలు గ్రామాలలో ప్రజలకు మంచినీటి సమస్య తీవ్రంగా ఉంటున్నందున సంబంధిత అధికారులు బోర్లన్నీ రిపేర్లు చేయించి మంచినీరు సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. గ్రామాలలో ఎక్కడైనా మంచినీటి సమస్య తలెత్తితే వెంటనే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కు సమాచారం అందించాలని ఆయన అన్నారు. ఏజెన్సీ మండలాలైన చర్ల దుమ్ముగూడెం లోని మారుమూల గ్రామాలలో మంచినీటి సమస్య తలెత్తితే సంబంధిత ఈ ఈ ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మానిటరింగ్ చేయించి సమస్య పరిష్కరిస్తానని, అలాగే మంచి నీటి సరఫరాకు కరెంటు సమస్య, సోలార్ రిపేర్, బోర్వెల్ రిపేర్ ఏమైనా ఉంటే తప్పకుండా మరమ్మత్తులు చేయించి గిరిజనులకు మంచినీటి సమస్య పరిష్కరిస్తానని ఐటీడీఏ పీవో బి రాహుల్ జిల్లా కలెక్టర్కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ పవర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో శిక్షణ పొంది జాతీయస్థాయిలో రాణించాలి

- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 25 , ప్రజాజ్యోతి,** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటూ తనకు నచ్చిన క్రీడలలో శిక్షణ పొంది జాతీయ స్థాయిలో పాల్గొనడంతో పాటు కళల పట్ల కూడా మక్కువ చూపించి మీలోని ప్రతిభను నైపుణ్యాలను పదిమంది గుర్తుంచుకునే విధంగా ప్రయత్నం చేయాలని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం నాడు భద్రాచలం పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరాల సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని ఐటీడీఏ పీవో బి రాహుల్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ మీ తల్లిదండ్రులు మా పిల్లలు బాగా చదివి ప్రయోజకులవుతారని అనే నమ్మకముతో ఉంటారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తప్పనిసరిగా మీరందరూ బాగా చదివి వృద్ధిలోకి రావాలన్నారు. క్యాంపులు నిర్వహించేది విద్యార్థిని, విద్యార్థులలో దాగివున్న ప్రతిభ మరియు నైపుణ్యాలను వెలికి తీసి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దడానికి ఇటువంటి క్యాంపులు నిర్వహిస్తారని దానిని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే ఇప్పటి నుండే భవిష్యత్తులో మీరు ఏమి కాదల్చుకున్నారో ఒక గోల్ అనేది మనసులో ఏర్పాటు చేసుకోవాలని, అందుకు తగినట్లు కష్టమైన పనినైనా ఇష్టంగా ఎలా చేస్తామో అలాగే చదువులో కూడా ముందుండాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో బి రాహుల్ మాట్లాడుతూ ఈనెల 25 నుండి వచ్చే నెల 9వ తేదీ వరకు 15 రోజుల పాటు జరిగే సమ్మర్ క్యాంపులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చదివే విద్యార్థిని, విద్యార్థులు మీరు చదివే సబ్జెక్టులతో పాటు యోగ, డాన్స్, వివిధ క్రీడలు మరియు బొమ్మల పెయింటింగ్, కుట్లు, అల్లికలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, డాన్సింగ్, క్లాసికల్ డాన్స్, ఫోక్ డాన్స్, వ్యాసరచన పోటీలు, ఒక్క నిమిషం ప్రసంగాలు, దేశభక్తి గీతాలు పాడటం వంటి శిక్షణలు సరదా సరదాగా జరిగే కార్యక్రమాలు విద్యార్థిని విద్యార్థులు మంచిగా నేర్చుకునే అవకాశం వచ్చిందని, ఇటువంటి కళలు, కల్చరల్ యాక్టివిటీస్ నేర్చుకుంటే మనలో కాన్ఫిడెన్స్ పెరుగుతుందని, చదువులో ఎలా మంచి మార్కులు తెచ్చుకుంటామనీ పట్టుదలగా ఉంటామో, ఈ కళా నైపుణ్యం ఉన్నవారు పబ్లిక్ లో ఎటువంటి భయం లేకుండా మాట్లాడడం అలాగే స్టేజ్ ఫియర్ లేకుండా మనలో కొత్త ఉత్సాహంతో మనసు ఉరకలు వేస్తుందని అన్నారు. చదువులో రాణిస్తే ఎంత మంచి గుర్తింపు వస్తుందో, ఆటపాటలు, కల్చరల్ పట్ల కూడా మక్కువ చూపించి బాగా నేర్చుకొని రాణిస్తే అంత గుర్తింపు వస్తుందని, ఈ 15 రోజుల క్యాంపులో విద్యార్థినీ విద్యార్థులు తప్పనిసరిగా శిక్షణ తీసుకొని అశ్రద్ధ చేయకుండా ప్రతిరోజు మీ ఇంటి వద్ద రిహర్సల్ చేస్తూ ఉండాలని అన్నారు. అనంతరం డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్ మాట్లాడుతూ ఐటీడీఏ భద్రాచలం పరిధిలోగల 50 ఉన్నత పాఠశాలలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులు 200 మందిని ఎంపిక చేసి వందమంది బాలికలకు బాలికల గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో, వంద మంది బాలురకు వికాసం పాఠశాలలో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ క్యాంపులను సక్రమంగా నిర్వహించడానికి ప్రత్యేకంగా క్యాంప్ ఇన్చార్జిలను, నిపుణులైన ఆర్పీలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపులో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులకు క్రీడలకు సంబంధించిన పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో రమేష్, జి సి డి ఓ అలివేలు మంగతాయారు, క్యాంప్ ఇంచార్జ్ సుభద్ర, నాగరాజు పాల్గొన్నారు.

# మహాసభ తీర్మానాలతో రైతు ఉద్యమాలకు శ్రీకారం

- 93 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటు
- రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధం





**కొత్తగూడెం, ఏప్రిల్ 25 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు రోజులపాటు జరిగిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభల్లో కీలక తీర్మానాలు చేశారు. భవిష్యత్తులో రైతు సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, కార్యదర్శి తీగల సాగర్ తెలిపారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన మహాసభల్లో వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి సుమారు 30 తీర్మానాలు ఆమోదించారు. ప్రభుత్వం శాస్త్రీయ వ్యవసాయ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, సాగునీరు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులకు ఇచ్చిన పట్టాలను అమలు చేసి భూమి వినియోగానికి అవకాశం కల్పించాలని రుణాలు, రైతుబంధు ఇవ్వాలని కోరారు. ధరణి, భూభారతి వంటి వ్యవస్థల్లో ఉన్న లోపాలను సరిచేయాలని సూచించారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర రూ.2400 ప్రకటించి వెంటనే కొనుగోలు చేయాలని వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27 నుంచి మే 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతు భరోసాను ఎకరాకు రూ.7500గా వెంటనే అమలు చేయాలని ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. మూడు సంవత్సరాల కాలానికి 93 మందితో కొత్త రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రైతు సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

### ››› తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రకటన

కొత్తగూడెం: ఏప్రిల్ 25న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభలో కొత్త రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పోతినేని సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శిగా తీగల సాగర్‌ను ఎంపిక చేశారు. కోశాధికారిగా మూడ్ శోభన్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపాధ్యక్షులుగా జూలకంటి రంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, పీ జంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, మాదినేని రమేష్, కందాల ప్రమీల, మల్లు నాగార్జున రెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, శెట్టి వెంకన్న, ఎం శ్రీనివాస్, తుమ్మల వెంకట్ రెడ్డి, వర్ణ వెంకటరెడ్డి ఎంపికయ్యారు. సహాయ కార్యదర్శులుగా అన్నవరపు సత్యనారాయణ, బొంతు రాంబాబు, శీలం ఫకీరమ్మ, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మాటూరి బాలరాజ్ గౌడ్, ఈసంపల్లి బాబు, వెంకటేష్, డి బాల్ రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, వెంకట్ మావో, దుబ్బాక రాంచందర్, చందు నాయక్‌లు నియమితులయ్యారు. మహాసభల్లో ఎన్నికైన ఈ కమిటీ రాబోయే కాలంలో రైతు సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించనుంది.



# అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ఫ్లెక్సీలు తొలగించాలి

- మహనీయుల ప్రాంగణంగా పరిరక్షణకు వినతి
- అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్




**కొత్తగూడెం, ఏప్రిల్ 25 (ప్రజాజ్యోతి )** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులు, రాజకీయ తోరణాలను వెంటనే తొలగించి ఆ ప్రదేశాన్ని మహనీయుల ప్రాంగణంగా పరిరక్షించాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ నేతృత్వంలో శనివారం కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ ప్రాంగణాన్ని వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం అనుచితమని పేర్కొన్నారు. విగ్రహాల చుట్టూ ఎలాంటి ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు ఉండకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాంగణానికి ఫెన్సింగ్, గ్రీనరీ, లైటింగ్, వాటర్ ఫౌంటెన్ పునరుద్ధరణ చేయాలని నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటాయించి సక్రమంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపై మేయర్ మూడ్ గణేష్ స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుబ్బారపు మధుసూదన్ చిన్ని, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంతోటి పాల్, పి. సురేందర్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండా రమేష్, పృధ్వి, దివాకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం జయప్రదానికి విస్తృత ఏర్పాట్లు





**కొత్తగూడెం, ఏప్రిల్ 25 ( ప్రజాజ్యోతి )** ఈనెల 26న జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియం గ్రౌండ్లో జరగనున్న హిందూ సమ్మేళనం సభను జయప్రదం చేసేందుకు హిందూ సంఘాలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల తండాల్లో కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ సభ వివరాలు తెలియజేస్తున్నారు. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్, బీజేపీతో పాటు అనుబంధ విద్యార్థి, మహిళ, ఉద్యోగ సంఘాలు ప్రచారంలో పాల్గొంటున్నాయి. హిందువుల ఐక్యత అవసరాన్ని వివరిస్తూ ప్రజలను సమ్మేళనానికి ఆహ్వానిస్తున్నారు. సింగరేణి కార్మిక వాడలు, కార్పొరేట్ కార్యాలయాలు, డైలీ కూలీల అడ్డాలు, రైతు కుటుంబాల్లోనూ ప్రచారం కొనసాగుతోంది. ప్రతి ఇంటికి కరపత్రాలు అందజేస్తూ సభకు హాజరుకావాలని కోరుతున్నారు. ఇటీవల వనవాసి పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ హిందూ సంస్థల నాయకులు పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు. సభ విజయవంతానికి నాలుగు ప్రచార వాహనాలు ఏర్పాటు చేశారు. సమ్మేళనంలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం కూడా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


# నీతి అయోగ్ బృందం పర్యటన పరిశీలన



**గుండాల. మార్చి 25. ప్రజా జ్యోతి** నీతి అయోగ్ గ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో శనివారం కేంద్ర బృందం పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గుండాలను ఆకాంక్షిత మండలంగా గుర్తించడంతో మండలంలోని వివిధ పనులు అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర అడిషనల్ సెక్రటరీ పవర్ అధికారి సాయిబాబా రాష్ట్ర నోడల్ అధికారి లోకేశు తో కూడిన బృందం మండలంలో పర్యటించారు గుండాల మండల కేంద్రం లోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని , కస్తూర్బా గాంధీ పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు సమస్యలను తెలుసుకొని నీతి అయోగ్ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు మండలంలో నెట్వర్క్ సమస్య తీవ్రంగా ఉందని మండల అధికారులు కేంద్ర బృందానికి తెలియజేయగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు ప్రాథమిక ఉన్నత పాఠశాల స్థలాన్ని చదును చేయాలని మీటియోగ్ అడిషనల్ అధికారి సాయిబాబా జిల్లా సీఈఓ కు తెలిపారు ప్రభుత్వాల ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి , జిల్లా మహిళ సంక్షేమ అధికారి లేనిన, డిఎం అండ్ హెచ్ ఓ సుదీప్ కుమార్, సత్యప్రసాద్ నవనీత్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నేడు ఆలయంలో జీర్ణోద్ధరణకు అనుజ్ఞ

- చినజీయర్‌స్వామి ఆద్వర్యంలో నేడు కళావాహన
- ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు
- కళావాహనకు అంకురార్పణ పూర్తి





**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 25 , ప్రజా జ్యోతి ,** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో నేడు అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. రామాలయంలో రూ.351 కోట్లతో ఆలయ విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో నేడు ఆలయంలో జీర్ణోద్ధరణకు అనుజ్ఞ తీసుకునేందుకు త్రిదండి చినజీయర్‌స్వామి ఆద్వర్యంలో కళావాహన నిర్వహించనున్నారు. ప్రధాన ఆలయం మినహా మిగతా ఒకేసారి 15 ఆలయాల్లోని 72 మూలమూర్తులకు కళావాహన నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయంలో పని చేసే వైదిక సిబ్బందితో పాటు విశ్రాంత సీనియర్ వైదిక సిబ్బంది సేవలను తీసుకుంటున్నారు. అదేవిధంగా యాదగిరిగుట్ట, ధర్మపురి, సింహాచలం నుంచి 40 మంది రుత్వికులు తరలిరానున్నారు. జీర్ణోధ్దరణకు అనుజ్ఞ సమయంలో 30 కలశాలలో పవిత్ర గోదావరి నుంచి తీర్థాన్ని సేకరించి ఆలయానికి తీసుకురానున్నారు. ఈ కళావాహన కార్యక్రమంలో పాల్గొనేం దుకు చినజీయర్ స్వామి శనివారం భద్రాచలం చేరుకున్నారు. నేడు జరిగే కళావాహన, జీర్ణోద్ధరణ అనుజ్ఞ కార్యక్రమంలో పాల్గొని వైదిక సిబ్బందికి దిశా నిర్దేశం చేయనున్నారు. 72 మూలమూర్తులకు ఒకేసారి కళావాహన నిర్వహించి జీర్ణోద్దరణకు అనుజ్ఞ తీసుకోనున్నారు. అనంతరం ఆయా మూలమూర్తులను రంగనాయకుల గుట్టపై ఉన్న ధ్యానమందిరంలో ఏర్పాటు చేసిన బాలాలయంకు తరలించనున్నారు. అక్కడ మూలమూర్తులకు ఆరాధన, వేద పారాయణం, పూజా కార్యక్రమాలను నించనున్నారు. నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం తిరిగి మూలమూర్తులను కొత్తగా నిర్మించే ఉప ఆలయాల్లో ప్రతిష్టాపన చేయనున్నారు. అలాగే లక్ష్మీ తాయారు అమ్మవారు, ఆండాళ్లమ్మ వారి విగ్రహాలను రామాలయంలోని ప్రధాన ఆలయంలో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు.

**భక్తులకు దర్శనాల నిలిపివేత**

రామాలయంలో నేడు కళావాహన సేవ నిర్వహణ కారణంగా భక్తులకు తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దర్శనాలు నిలిపివేయనున్నారు. 3 గంటల తరువాత దర్శన సౌకర్యం కల్పిస్తారు. కళావాహన రామాలయంలోని నిత్యకల్యాణ వేదిక ఆవరణలో నిర్వహించనుండగా, 72 మూలమూర్తులకు కళావాహన సేవను సుమారు 100 మంది వైదిక పెద్దల సమక్షంలో నిర్వహించనుండటంతో భక్తులను రామాలయంలోకి అనుమతించడం లేదు.

**వంద మందికి పైగా వైదిక పెద్దల ఆధ్వర్యంలో**

రామాలయంలో నేడు నిర్వహించే కళావాహన సేవకు రామాలయంలో విధులు నిర్వహించే 30 మంది వైదిక బృందంతో పాటు యాదగిరిగుట్ట, ధర్మపురి, సింహాచలంతో పాటు పాంచరాత్రాగమ పండితులు 50 మంది వరకు హాజరు కానున్నారు. అలాగే ఇతర పరిచారక సిబ్బందితో కలిపి వంద మంది వరకు వైదిక బృందం కళావాహన సేవలో పాల్గొననున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి భద్రాద్రి దేవస్థానం ఈవో కె.డా. మోదద్రావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజ యరాఘవన్, కోటిరామస్వరూప్ రాఘవాచార్యులతో పాటు ప్రధాన వైదిక సిబ్బంది పలుమార్లు చర్చించి ఏర్పాట్లను పూర్తి చేశారు. రామాలయంలో జీర్ణోద్ధరణకు అనుజ్ఞ ప్రక్రియకు అంకురార్పణ నిర్వహించారు. ఈ సమయంలో పవిత్ర గోదావరి నది నుంచి 30 కలశాలలో పవిత్ర గోదావరి నుంచి తీర్థాన్ని సేకరించి ఆలయానికి తీసుకురానున్నారు. అనంతరం యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ ఆవాహన పూర్తి చేశారు. కలశాలలో నీటితో నేడు కళావాహన సేవ నిర్వహించనున్నారు.

# భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 25 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

